క్లుప్తంగా

షేక్‌బాబూలాల్‌కు మాజీ ఎమ్మెల్యే నివాళి



షేక్ బాబులాల్‌కు నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: పట్టణంలోని 18వ వార్డుకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త షేక్ బాబులాల్ మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు అక్కడికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ ఆరీఫ్, షేక్ ఫజల్, షేక్ అస్లం, షేక్ గౌస్‌బాషా, షేక్ బావాజీ, షేక్ గఫూర్, షేక్ జిలాన్‌బాయి, సురేష్, సుమతమ్మ, శివ, రమేష్, షేక్ షఫీ, షేక్ సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

తొండంబట్టులో తొలగిన మురుగు



తొండంబట్టులో బ్లీచింగ్ చల్లుతున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

వరదయ్యపాళెం: మండలంలోని తొండంబట్టు గ్రామంలో అధికారుల చొరవతో మురుగును తొలగించారు. స్థానికంగా నెలకొన్న పారిశుధ్య ఇబ్బందులపై ఈ నెల 25న పారిశుధ్య.. పరమ అధ్వాన్నం అన్న కథనం సాక్షి దినపత్రికలో ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఎంపీడీఓ ప్రసాద్, ఈఓపీఆర్డీ చిరంజీవి, పంచాయతీ కార్యదర్శి, వైద్య సిబ్బందిని అప్రమత్తం చేసి తొండంబట్టు గ్రామంలో నెలకొన్న మురుగును వైదొలగించాలని ఆదేశించారు. మంగళవారం పంచాయతీ కార్యదర్శి వెంకయ్య, ఏఎన్‌ఎం సునీత, సిబ్బందితో కలసి రోడ్లపై నిల్వ ఉన్న మురుగు నీటిని తొలగించారు. అనంతరం వీధులలో దోమల నివారణకు బ్లీచింగ్ చల్లారు. అనంతరం ఇళ్ల ముంగిట మురుగునీరు నిల్వ చేసుకోవద్దని ప్రజలకు అవగాహన కల్పించారు. అధికారుల చొరవపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

మురుగు కాలువ లేక ఇక్కట్లు



పూడిపోయిన కాలువ

నాగలాపురం: పట్టణంలోని గాంధీ వీధిలో మురుగు నీటి కాలువలు లేక స్థానికులు సతమతమవుతున్నారు. పేరుకు మేజర్ పంచాయతీ అయినా అభివృద్ధి మాత్రం శూన్యం. మురుగు నీటి కాలువపై ఓ చెట్టు విరిగి పడడంతో చెత్తాచెదారం పేరుకుపోయి నిలిచి పోవడంతో ఓ వైపు దుర్వాసన, మరో వైపు దోమలతో రాత్రి వేళ కంటి మీద కునుకు లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా దోమల తాకిడికి స్థానికులు సైతం తరచూ ఆసుపత్రి పాలవతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. కనీసం మురుగు నీరు శుభ్రం చేసే పరిస్థితి కూడా లేనట్లు స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ పారిశుద్య కార్మికులకు చెప్పినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి మురుగు నీటి కాలువలను శుభ్రం చేసి దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చెరువు కబ్జాను అడ్డుకుంటాం

రేణిగుంట: మండలంలోని తూకివాకం పంచాయతీ ఎర్రమరెడ్డి పాలెం చెరువు ఆక్రమణను అడ్డుకుని ఆక్రమణదారులపై కేసులు పెట్టాలని లేదంటే గ్రామస్తులద్వారా ఫెన్సింగ్‌ను తొలగిస్తామని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెనుమూరు హేమలత హెచ్చరించారు. ఎర్రమరెడ్డి పాలెం చెరువును మంగళవారం రైతులతో కలసి సీపీఎం నాయకులు పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ సర్వే నెంబర్ 141 లో సుమారు 55 ఎకరాలు చెరువు ఉండగా, అందులో 10 ఎకరాల 50 సెంట్లు చెరువు ముంపు భూమి ఆక్రమణకు గురైందని అన్నారు. కొంతమంది వ్యక్తులు చెరువులో మట్టి తోలి ప్రైవేట్ కల్యాణ మండపం కట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఆక్రమణదారులతో స్థానిక ఇరిగేషన్ అధికారులు కుమ్మక్కయ్యారని అందువల్లే స్పందించడం లేదని అన్నారు. కార్యక్రమంలో రేణిగుంట ప్రాంతీయ కమిటీ కన్వీనర్ హరినాథ్‌తోపాటు స్థానిక రైతులు పాల్గొన్నారు.



చెరువులో మట్టి తోలి కంచె వేసిన ప్రదేశం

రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం వరదయ్యపాళెం మండల ప్రజలు ఎదురుచూస్తున్నారు. నాలుగు రోజుల క్రితం బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ సుధీర్‌రెడ్డి సమస్యలకు పరిష్కారం చూపుతారని బాధిత అర్జీదారులు ఎదురు చూస్తున్నారు. ప్రధానంగా మండలంలో ఇళ్ల పట్టాలు, మ్యుటేషన్లు, గ్రావెల్ అక్రమ రవాణా, హౌసింగ్ లబ్ధిదారులకు పొజిషన్ సర్టిఫికెట్ల మంజూరు తదితర సమస్యలు ఉన్నాయి. వీటి పరిష్కారం కోసం నూతన తహసీల్దార్ ప్రత్యేక చొరవ చూపాల్సి ఉంది.

– వరదయ్యపాళెం



బత్తలవల్లం సమీపంలోని చెదులుపాకం వద్ద తమిళనాడుకు తరలుతున్న గ్రావెల్

సమస్యలున్నాయి.. పరిష్కరించండి

వరదయ్యపాళెం, ఇందిరానగర్ పంచాయతీల్లో ఇళ్లు లేని 450 కుటుంబాలకు ఇళ్ల పట్టాల పంపిణీ కోసం గత ప్రభుత్వంలో బీఎన్‌కండ్రిగ మండలం తలారివెట్టు గ్రామానికి చెందిన సర్వే నెంబర్లు 130, 131, 135, 136/2లలో గల 15.31 ఎకరాలను రైతుల నుంచి సేకరించారు. వారికి ఆ ప్రభుత్వంలోనే 2023 జులైలో ఎకరాకు రూ.12.50లక్షల చొప్పున రూ.1.91 కోట్ల పరిహారాన్ని సైతం రైతులకు అందజేశారు. అయితే సార్వత్రిక ఎన్నికలు రావడంతో పట్టాల పంపిణీ ప్రక్రియ ఆగిపోయింది. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తి కావస్తున్నా పట్టాల పంపిణీ ప్రక్రియ ఇప్పటివరకు నోచుకోలేదు. ప్రస్తుత తహశీల్దార్ ఈ సమస్యపై దృష్టి పెట్టి అర్హత కలిగిన 450 మందికి పట్టాల పంపిణీ చేయాలని కోరుతున్నారు.

పొజిషన్ సర్టిఫికెట్లు

ప్రస్తుత ప్రభుత్వంలో సొంత స్థలం ఉండి ఇళ్లు లేని నిరుపేదలను ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. ఆ దశగా 800 మందికి పైగా సొంత స్థలం కలిగిన వారు ఇళ్ల మంజూరు కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే వారికి పొజిషన్ సర్టిఫికెట్లు రెవెన్యూ అధికారులు ఇవ్వాల్సి ఉంది. ఈ సర్టిఫికెట్లు ఇవ్వడంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో సంబంధిత లబ్ధిదారులకు ఇళ్ల మంజూరులో జాప్యం ఏర్పడుతోంది. 800 మందికి పైగా తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా వారికి పొజిషన్ సర్టిఫికెట్లు అందలేదు.

గ్రావెల్ అక్రమ రవాణా

ప్రధానంగా మండలంలో బత్తలవల్లం, చెదులుపాకం, చిన్న పాండూరు శోత్రియ భూముల్లో గ్రావెల్ అక్రమ రవాణా కూటమి నేతల కనుసన్నల్లో జోరుగా సాగుతోంది. ఇందులో అక్రమ అనుమతుల పేరిట జోరుగా తమిళనాడుకు తరలిస్తున్నారు. దీనిపై స్థానిక గ్రామస్తులు గగ్గోలు పెడుతున్నా పట్టించుకునే పరిస్థితి లేదు.

వెంటాడుతున్న కోర్టు కేసులు

మండలంలో 220కి పైగా హైకోర్టులో భూవివాదాలకు సంబంధించి కేసులు జరుగుతున్నాయి. దీని కారణంగా వారంలో 2, 3 పర్యాయాలు హైకోర్టుకు రెవెన్యూ సిబ్బంది హాజరు కావాల్సి ఉంది. ప్రధానంగా చిన్న పాండూరు సమీపంలోని అపోలో పరిశ్రమకు కేటాయించిన భూములకు సంబంధించి రైతులకు పరిహారం ఇవ్వడంలో తలెత్తిన సమస్యలు పరిష్కారం కాకపోవడంతో సంబంధిత రైతులు హైకోర్టును ఆశ్రయించారు. అయితే ఈ కేసుల పరిష్కారం కోసం తహశీల్దార్ ప్రత్యేక కృషి చేయక తప్పదు

ముందుకు సాగని మ్యుటేషన్లు

మండలంలో రైతుల భూములకు సంబంధించి ఆన్‌లైన్ వెబ్‌లైన్ నమోదు కోసం పలువురు రైతులు మ్యుటేషన్‌కు దరఖాస్తు చేసుకున్నారు. అయితే మండల వ్యాప్తంగా వందల సంఖ్యలో దరఖాస్తులు ఉన్నప్పటికీ ఆ ఫైళ్లు పెండింగ్‌లోనే ఉన్నాయి. వాటిపై దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.

రీసర్వే ప్రక్రియ

మండలంలో భూముల రీసర్వే చేపట్టేందుకు గత ప్రభుత్వంలో నెల్లటూరు, అయ్యవారిపాళెం, కోవూరుపాడు గ్రామాలను పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి రీసర్వే ప్రక్రియను ప్రారంభించారు. అలాగే ప్రస్తుత ప్రభుత్వంలో అదే పథకాన్ని కొనసాగిస్తూ యానాదివెట్టు గ్రామాన్ని ఎంపిక చేశారు. అక్కడ 2 నెలల నుంచి రీసర్వే ప్రక్రియ కొనసాగుతోంది. అయినా ఇప్పటివరకు ఏ గ్రామంలో పూర్తి స్థాయిలో రీసర్వే పూర్తి కాకపోవడం గమనార్హం.

సమస్యల పరిష్కారానికి చొరవ



మండలంలో రెవెన్యూ శాఖాపరమైన పెండింగ్ సమస్యల పరిష్కారంపై దృష్టి పెడతా. నూతనంగా బాధ్యతలు స్వీకరించాను. సుదీర్ఘకాలంగా నెలకొన్న సమస్యలను అధ్యయనం చేసి, నా పరిధిలో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు చొరవ చూపుతా. రికార్డులు సక్రమంగా ఉన్న మ్యుటేషన్లు సైతం పూర్తి చేస్తాం.

–సుధీర్ రెడ్డి, తహసీల్దార్, వరదయ్యపాళెం మండలం




తలారివెట్టు సమీపంలో ప్రభుత్వం కొనుగోలు చేసిన స్థలం, యానాదివెట్టు గ్రామంలో చేపట్టిన రీసర్వే

లాంజ్ బాత్‌రూమ్‌లో వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు ఆర్టీసీ ప్రాంగణంలోని ఎంఎస్‌ఆర్ డీలక్స్ లాంజ్ బాత్ రూమ్‌లో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. తిరుపతి జిల్లా బీఎన్ కండ్రిగ మండలం కారనిమిట్టకు చెందిన ఎస్.విజయకుమార్ (26) మదనపల్లిలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో అనస్థీషియా టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. అతడికి రెండు నెలల క్రితం సమీప బంధువైన ఉషతో వివాహమైంది. సోమవారం విజయకుమార్ మదనపల్లిలోని వైద్యశాలకు వెళ్లాడు. డాక్టర్ సూచనల మేరకు మందులు తీసుకెళ్లేందుకు నెల్లూరుకు వచ్చాడు. ఆర్టీసీ బస్టాండ్‌లోని రిజర్వేషన్ కౌంటర్ పక్కనే ఉన్న ఎంఎస్‌ఆర్ డీలక్స్ లాంజ్‌లో బాత్‌రూమ్‌కు వెళ్లాడు. అక్కడే కుప్పకూలి మృతిచెందాడు. ఈ విషయాన్ని గమనించిన లాంజ్ నిర్వాహకులు చిన్నబజారు పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. బాధిత కుటుంబ సభ్యులకు సమాచారం అందించి మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మంగళవారం నెల్లూరుకు చేరుకున్న బాధిత కుటుంబం విజయకుమార్ మృతదేహాన్ని చూసి కన్నీటి పర్యంతమైంది. మృతుని తమ్ముడు చందు ఫిర్యాదు మేరకు చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతికి గల కారణాలు తెలియరావాల్సి ఉంది. ఎస్సై వీసీ సుబ్రహ్మణ్యం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కిక్కిరిసిన ముక్కంటి ఆలయం



శ్రీకాళహస్తి: అమావాస్య ఘడియలు మంగళవారం కూడా ఉండడం వల్ల శ్రీకాళహస్తీశ్వరాలయం కిక్కిరిసిపోయింది. భక్తులందరూ భారీగా తరలివచ్చి బారులు తీరారు. రాహు, కేతు పూజలు చేయించేందుకు వచ్చిన భక్తులతో ఆలయం జనసంద్రంగా మారింది. ఉదయం నుంచి రాత్రి ఆలయం మూత వేసే సమయానికి దాదాపు 30 వేల మంది భక్తులు స్వామి, అమ్మ వార్లను దర్శించుకున్నారు. 7,031 రాహు, కేతు పూజలు జరిగాయి. సర్వదర్శనం, ప్రత్యేక దర్శనం కోసం భక్తులు సుమారు మూడు గంటల పైగా క్యూలలో నిరీక్షించాల్సి వచ్చింది.

భూమి కాజేశారు.. న్యాయం చేయండి



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న సుబ్బమ్మ

నాగలాపురం: పసుపు కుంకుమ కానుకగా ఇచ్చిన భూమిని తనకు తెలియకుండా దొంగ పత్రాలు తయారు చేసి రిజిస్ట్రేషన్ చేసినట్లు, భూమిని కాజేశారన్న ఘటన మండలంలో ఆలస్యంగా వెలుగులో కొచ్చింది. వివరాలు.. మండలంలోని టి.పి.పాలెం గ్రామ పంచాయతీలో నివాసమున్న వితంతు మహిళ అప్పిలి సుబ్బమ్మకు సదరు రెవెన్యూ లెక్క ధాఖల ప్రకారం సర్వే నెంబరు 31/18 లో 0-46 సెంట్లు, 31/19 లో 0-17 సెంట్లుగా ఉన్న భూమిని పుట్టింటి నుంచి పసుపు కుంకుమ కానుకగా ఆమె తండ్రి రాసిచ్చినట్లు బాధిత మహిళ తెలిపింది. తనకు సొంతమైన భూమిని అదే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు వారి పేరుతో కొంత మంది అధికారులతో కుమ్మక్కై ఆన్‌లైన్ చేసుకుని అమ్ముడానికి ప్రయత్నాలు చేస్తున్నారనే విషయం తెలుసుకుంది. దీనిపై ఆర్డీఓ కార్యాలయంలో ఫిర్యాదు చేసినప్పటికీ ఉపయోగం లేకపోయింది. దీంతో సుబ్బమ్మ నాగలాపురం రెవెన్యూ కార్యాలయానికి వెళ్లి మంగళవారం తహసీల్దార్ హనుమాన్ నాయక్‌కు ఫిర్యాదు చేసింది. దీనిపై తహసీల్దార్ మాట్లాడుతూ టీపీపాలెం వీఆర్‌ఓ ద్వారా నోటీసులు జారీ చేసి జిల్లా ఉన్నతాధికారులు తెలియజేసి బాధితురాలికి న్యాయం చేస్తామని అన్నారు.

బంగారు తిరుచ్చిపై శ్రీకృష్ణుడు

చంద్రగిరి: తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయానికి అనుబంధంగా వెలసిన శ్రీకృష్ణస్వామి వారు తన దేవేరులతో కలసి మంగళవారం బంగారు తిరుచ్చి భక్తులను అనుగ్రహించారు. స్వామివారి జన్మనక్షత్రమైన రోహిణి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవేరులను సువర్ణశోభితంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

విద్యతోనే బాలికా వికాసం



మాట్లాడుతున్న కృష్ణ మంజరి

రేణిగుంట: బాలికలు బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేసినప్పుడే సమగ్ర వికాసం పొందగలరని చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ కృష్ణ మంజరి తెలిపారు. మండలంలోని వెంకటాపురం పంచాయతీ ఆర్ అగ్రహారంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం బాలికలకు, వారి తల్లిదండ్రులకు కిశోరి వికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలికలనుద్దేశించి కృష్ణ మంజరి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో బాలికలు ఎక్కువగా అన్యాయానికి గురవుతున్నారని తెలిపారు. అపరిచితులు వాట్సాప్, ఇన్‌స్టాగామ్, ఫేస్‌బుక్ ద్వారా ఎవరైనా మెసేజ్ పెట్టినా లేదా ఎవరైనా తెలియని వ్యక్తులు కాల్ చేసి ఓటీపీ అడిగినా ఎవరూ స్పందించకూడదని తెలిపారు. ఎవరైనా సైబర్ నేరస్తుల బారిన పడితే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1930కి కానీ100కి కానీ తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ హేమావతి, రేణిగుంట మండల ప్రగతి కో–ఆర్డినేటర్ జయలక్ష్మి, రాస్ భారతి, అంగన్‌వాడీ టీచర్ సుమతి పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

సాక్షి ఎఫెక్ట్..



వ్యాపారులతో మాట్లాడుతున్న సీఐ జయచంద్ర

రేణిగుంట: పట్టణంలో రోజు రోజుకూ పెరుగుతున్న వాహనాల రాకపోకల వల్ల ట్రాఫిక్ స్తంభించిపోతోంది. అందులోనూ రోడ్డుకు ఒకవైపు నో పార్కింగ్ బోర్డులు ఏర్పాటు చేసిన ద్విచక్ర వాహనాలను బోర్డుల వద్ద పార్కింగ్ చేయడంపై 24వ తేదీ సాక్షి జిల్లా మొదటి పేజీలో వచ్చిన 'బే ఖాతర్!' వార్తకు రేణిగుంట అర్బన్ సీఐ జయచంద్ర స్పందించారు. ఆయన మంగళవారం పట్టణంలోని వ్యాపారులను పోలీస్ స్టేషన్ వద్దకు పిలిపించి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. పట్టణంలోని వీధుల్లో ఒక రోజు ఒకవైపు, మరో రోజు మరోవైపు ద్విచక్ర వాహనాలు నిలుపుకోవడం వల్ల ట్రాఫిక్ అంతరాయం లేకుండా ఉంటుందని సూచించారు. వ్యాపారులు తమ దుకాణాల ముందు ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను పార్కింగ్ చేయకుండా చూడాలని కోరారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ జరిమానాలు విధించి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తాగునీటి పైపులు ధ్వంసంపై ఆందోళన



వరదయ్యపాళెంలో రోడ్డుపై వాహనాలను అడ్డుకుని ఆందోళన చేస్తున్న స్థానికులు

వరదయ్యపాళెం: ప్రజల అవసరాలతో చెలగాటమాడుతూ ఇబ్బందులకు గురి చేస్తున్న గ్యాస్ పైప్‌లైన్ కాంట్రాక్టర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీపీఐ సత్యవేడు నియోజకవర్గ కార్యదర్శి ఆంబాకం చిన్నిరాజ్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ప్రజలతో కలసి వరదయ్యపాళెం బస్టాండ్ ఆవరణలో ధర్నా నిర్వహించారు. రాకపోకలను అడ్డుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నెల రోజులుగా వరదయ్యపాళెం టౌన్‌లో గ్యాస్ పైప్‌లైన్ పనులు చేపడుతున్నారని, తద్వారా పలుచోట్ల పంచాయతీ ప్రజలకు సరఫరా అయ్యే తాగునీటి పైప్‌లైన్లు ధ్వంసమయ్యాయని తెలిపారు. దీంతో స్థానికులు తాగునీటి కోసం తీవ్ర అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. అంతేకాక పైప్‌లైన్ కోసం తీసిన కాలువను పూడ్చకుండా అలానే వదిలేయడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని ఆరోపించారు. ఇన్ని ఇబ్బందులు జరుగుతున్నా పైప్‌లైన్ కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై తహశీల్దార్ సుధీర్ రెడ్డి, ఈఓ బసిరెడ్డి, ఎంపీడీఓ ప్రసాద్‌లకు వినతిపత్రం అందజేశారు. అయితే తక్షణమే కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

బొర్రా సరోజమ్మకు ఘన నివాళి



సరోజమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పిస్తున్న ఎంపీ గురుమూర్తి, నూకతోటి రాజేష్

కేవీబీపురం: వైఎస్సార్ సీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా మహిళా అధ్యక్షురాలు బొర్రా మాధవిరెడ్డి అత్త సరోజమ్మ మరణించారు. సమాచారం అందుకున్న తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి, సమన్వయకర్త నూకతోటి రాజేష్ మంగళవారం సరోజమ్మ మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మృతి బాధాకరమని, వారి కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. నివాళులర్పించిన వారిలో బీరేంద్ర వర్మ, ఉమ్మడి చిత్తూరు జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ వేలూరు రాకేష్, మండల పార్టీ అధ్యక్షుడు గవర్ల కృష్ణయ్య, ఎంపీపీ భర్త నందకుమార్, జెడ్పీటీసీ మూర్తి మునెమ్మ, జిల్లా కార్యదర్శి లాల్‌బాబు యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు ధనంజయులు రెడ్డి, వైస్ ఎంపీపీ దేరాల శ్రీనివాస్ యాదవ్, పార్టీ నేతలు ప్రవీణ్ కుమార్ రెడ్డి, గిరిబాబు ఉన్నారు.

దినచర్యలో యోగా తప్పనిసరి కావాలి





నాగలాపురంలో యోగాసనాలు వేస్తున్న స్థానికులు, రేణిగుంటలో యోగాలో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు, గాజుల మండ్యంలో యోగాసనాలు వేస్తున్న స్థానికులు

నారాయణవనం: ప్రతి ఒక్కరి దినచర్యలో యోగా తప్పనిసరిగా ఉంటే ఆరోగ్యం సొంతమవుతుందని వక్తలు పేర్కొన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలం నారాయణవనంలో నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 7 గంటల నుండి 8 గంటల వరకు శిబిరాలలో శిక్షణనిచ్చారు. అయిదు రోజులపాటు శిక్షణ ఇస్తున్నట్లు ఎంపీడీఓ గుణశేఖర్ పేర్కొన్నారు. మండల స్థాయిలో శిక్షణ పొందిన వారు గ్రామ స్థాయిలో శిక్షణ శిబిరాలను నిర్వహించి అంతర్జాతీయ యోగాడే రోజున మెగా యోగా శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. యువత తమ పేర్లను సచివాలయంలో నమోదు చేసుకోవాలని ఎంపీడీఓ సూచించారు. యోగా కేంద్రాలలో మండల స్థాయి అధికారులు, సిబ్బంది, సచివాలయ సిబ్బంది, స్థానికులు పాల్గొని అభ్యసించారు.

యోగా శిక్షణ తరగతులు

నాగలాపురం: మండలంలోని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్లేస్‌లో సర్పంచ్ చిన్నదొరై సుధా ఆధ్వర్యంలో ఎంపీడీఓ బాలాజీ నాయక్ పర్యవేక్షణలో మంగళవారం యోగాంధ్ర శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, పంచాయతీ అధికారులందరికీ వ్యాయామ ఉపాధ్యాయుడు జయశంకర్ యోగాపై శిక్షణ అందించారు పంచాయతీ కార్యదర్శి శైలేంద్ర, సచివాలయ సిబ్బంది వాసు, హరి, భార్గవ్, లోకేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

రేణిగుంటలో యోగాంధ్ర ప్రారంభం

రేణిగుంట: రాష్ట్ర ప్రభుత్వం నెల రోజుల పాటు చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా రేణిగుంట మండలంలో నాలుగు శిక్షణ కేంద్రాల్లో యోగా తరగతులు ప్రారంభమయ్యాయి. మండలంలోని రేణిగుంట జెడ్పీ హైస్కూల్ మైదానం, గాజుల మండ్యం శివాలయం, గుత్తి వారిపల్లి హైస్కూల్, కరకంబాడి హై స్కూల్లో నాలుగు యోగా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మండల స్థాయి అధికారులకు పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించారు. ఉదయం 6 గంటల నుంచి యోగా మాస్టర్లు శిక్షణ ఇస్తున్నారు. మంగళవారం మొదటి రోజు రేణిగుంట జెడ్పీ హైస్కూల్లో జరిగిన యోగ శిక్షణలో ఈవో మణి, సర్పంచ్ నగేషం, మండల కో–ఆప్షన్ మెంబర్ హసన్ సాహెబ్, ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు జూలియస్ రాజు, గాజుల మండ్యంలో ఏవో పిచ్చిరెడ్డి, ఈవో గిరిధర్, సర్పంచ్ గంగారి రమేష్, ఎంపీటీసీ జువ్వల ధనుంజయ రెడ్డి, యోగా మాస్టర్లు వాసుదేవ రెడ్డి, పూర్ణ, రేఖా రాణి తదితరులు పాల్గొన్నారు.

యోగా అలవరుచుకోవాలి

కేవీబీపురం: ప్రతి వ్యక్తి రోజువారీ దైనందిన జీవితంలో యోగాను అలవాటు చేసుకోవాలని ఎంపీడీఓ మాలతి పిలుపునిచ్చారు. మంగళవారం యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎంపీడీఓ కార్యాలయం, సచివాలయాల వద్ద యోగా శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ యోగా శిక్షణ కార్యక్రమాలు జరిగే ప్రాంతాలను సందర్శించి, పలు సూచనలు, సలహాలు తెలియజేశారు.

కన్నె పుట్టాలమ్మకు ప్రత్యేక పూజలు

నారాయణవనం: మండలంలోని పాలమంగళం ఉత్తరపుకండ్రిగ గ్రామ జాతర సందర్భంగా మంగళవారం కన్నెపుట్టాలమ్మకు ప్రత్యేక పూజలు చేపట్టి, నైవేద్యాలను సమర్పించారు. ఆదివారం గ్రామ జాతరకు చాటింపు వేశారు. మంగళవారం వేకువ జామున కన్నెపుట్టాలమ్మకు ప్రత్యేక అభిషేకాలను నిర్వహించారు. బుధవారం గ్రామంలో పటాల ఊరేగింపు, గురువారం నడివీధి గంగమ్మ స్థాపన, రాత్రి నిమజ్జనంతో జాతర పరిసమాప్తమవుతుందని నిర్వాహకులు తెలిపారు.